రేషన్‌కార్డు, ఇళ్లు ఇవ్వని బీఆర్‌ఎస్ సర్కారు



రఘునాథపల్లి: ఫతేషాపూర్‌లో మాట్లాడుతున్న సింగపురం ఇందిర



ఇబ్రహీంపూర్‌లో కాంగ్రెస్‌లో చేరిన వారితో ఇందిర

- కాంగ్రెస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి ఇందిర

రఘునాథపల్లి: పదేళ్లలో కొత్త రేషన్‌కార్డులు, ఇళ్లు ఇవ్వని దౌర్భాగ్య బీఆర్‌ఎస్ పార్టీకి ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని కాంగ్రెస్ స్టేషన్‌ఘన్‌పూర్ అభ్యర్థి సింగపురం ఇందిర పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ఫతేషాపూర్, ఇబ్రహీంపూర్, లక్ష్మీతండా, మల్లంపల్లి, శివాజీనగర్, ఖిలాషాపూర్, కంచనపల్లి ఆశీర్వాద సభల్లో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇచ్చిన స్థలాలను ప్రభుత్వం లాక్కోవడం సిగ్గుచేటన్నారు. దళితబంధు, గృహలక్ష్మి కమీషన్ల మయమయ్యాయని ఆరోపించారు. ప్రభుత్వ వైఖరితో యువకులు ఉద్యోగాలు రాక రోడ్డున పడ్డారని, కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆరు నెలల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తానని ఆమె పేర్కొన్నారు. ఎంపీపీ మేకల వరలక్ష్మి, జిల్లా నాయకులు లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి, కోళ్ల రవిగౌడ్, గొట్టం భాస్కర్‌రెడ్డి, సుభాష్‌చందర్‌రెడ్డి, పోకల శ్రీనివాస్, చింత నరేష్, మోర్తాల ప్రభాకర్, ఎండీ గౌస్‌మియా, మేడిపల్లి నరేష్, ఎండీ యాకుబ్, ఎండీ హయత్ అలీ, పేర్ని ఉషారవి, ఎండీ షబ్బీర్, కర్ణాకర్‌రెడ్డి, యామంకి శ్రీను, నామాల నాగరాజు, ముప్పిడి శ్రీధర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి..

మండలంలోని ఇబ్రహీంపూర్‌లో ఇందిర సమక్షంలో బీఆర్‌ఎస్ వార్డు సభ్యుడు గిరబోయిన సతీష్‌తో పాటు దొరగొల్ల సత్తయ్య, దొరగొల్ల కుమార్, మల్లయ్య, నూనె చిన్నఉప్పలయ్య, శివార్ల కుమార్, శివార్ల శ్రీను, మల్లేష్, మహేందర్, మహేష్, ఉల్లోజు శ్రీను, రాజు, నరేష్, శ్రీధర్, కనకరాజు, ప్రశాంత్, మధు, సిద్ధులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి ఇందిర కాంగ్రెస్ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఫతేషాపూర్‌లో బీఆర్‌ఎస్ నుంచి గడ్డం సందీప్, భాస్కర్, లోకేష్, ప్రశాంత్, సునీల్, వీరస్వామి, జహంగీర్, శ్రీనివాస్, రఘుపతి, శ్రీలత తదితరులు ఇందిర సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

ఇందిరకు టీడీపీ మద్దతు

జఫర్‌గఢ్: సింగపురం ఇందిరకు జఫర్‌గఢ్ మండలానికి చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం సంపూర్ణ మద్దతు తెలిపారు. కాసర్ల ఏలీయా, మొట్టక ఎల్లయ్య, గాడబోయిన బిక్షపతి, నీలం సాగరం, నల్లతీగల బాలయ్య ఉన్నారు.

ఇందిర తరఫున కుతూరు ప్రచారం

సింగపురం ఇందిరను భారీ మెజార్టీతో గెలిపించాలని మండల కేంద్రంలో ఆమె కుమార్తె అర్పిత ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తా



పదమటికేశ్వాపూర్‌లో మాట్లాడుతున్న కొమ్మూరి



బచ్చన్నపేట: మహిళలతో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

- గెలవగానే ఆరు గ్యారంటీల అమలు
- కాంగ్రెస్ జనగామ అభ్యర్థి 'కొమ్మూరి'

బచ్చన్నపేట: ప్రజలకు అందుబాటులో ఉంటూ జనగామ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అలింపూర్, పడమటికేశ్వాపూర్, పోచన్నపేట, నారాయణపురం, బచ్చన్నపేట గ్రామాల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, భోనాలు, కోలాటాలతో ప్రతాప్‌రెడ్డికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ హయాంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశానని చెప్పారు. వైఎస్సార్ హయాంలో రిజర్వాయర్లను నిర్మించి దేవాదుల కెనాల్ ద్వారా జలాలను తీసుకురావడంతో ఈ ప్రాంతం సస్యశ్యామలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ స్కీంలను గెలిచిన తర్వాత అమలుచేస్తామని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పూర్తిగా విఫలమైందని, అన్నదాతలకు ఇంత వరకు పంట రుణాలు మాఫీ చేయలేదని విమర్శించారు. ఈ ప్రాంత సమస్యలు తెలియని నాయకులు వస్తున్నారని, వారికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్‌లో చేరిక..

మండలంలోని పడమటికేశ్వాపూర్‌లో నాయకులు జంగిటి విద్యానాథ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో 200 మంది చేరారు. అలాగే చేర్యాల మండల మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి, లెనిన్‌నగర్ సర్పంచ్ సనాది సబితభాస్కర్, ఐనాపూర్ సర్పంచ్ చెరుకు రాంరెడ్డిలతో పాటు సీపీఎం నుంచి 100 మంది కొన్నె గ్రామంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కొమ్మూరి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మసూద్, ఆరుగొండ పర్శరాములు, జ్యోతి భాస్కర్, నిమ్మ శ్రావణ్‌రెడ్డి, జంగిటి నరేష్, విజయ్‌కాంత్, సంతోష్‌రెడ్డి, భాస్కర్, వినయ్, బాలకిషన్, రమేష్, వెంకట్‌రెడ్డి, బాలమణి, విజయలక్ష్మి, మంజుల, వేణువందన రామాచారి, కిష్టయ్య పాల్గొన్నారు.

కొమ్మూరిని భారీ మెజార్టీతో గెలిపించాలి

జనగామ రూరల్: కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కుమారుడు ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మండలంలోని పెంబర్తిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

జనగామలో కాంగ్రెస్ ఇంటింటి ప్రచారం

జనగామ: పట్టణంలో 18, 19, 21వ వార్డుల పరిధిలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. గడప గడపకు తిరుగుతూ ఆరు గ్యారంటీ పథకాలను వివరిస్తూ చేతి గుర్తుకు ఓటువేసి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వేమెళ్ల సత్యనారాయణరెడ్డి, కంచ రాములు, ఆకుల లక్ష్మయ్య, మోటే శ్రీనివాస్, బండారు శ్రీనివాస్, దోర్నాల వెంకటేశ్వర్లు, మంగ సత్యం, బోరెల్లి సిద్దులు, ఏల జనార్దన్, గందమల్ల కమలాకర్, పాముకుంట్ల మణిదీప్ పాల్గొన్నారు. కాగా, సీపీఎంకి చెందిన పలువురు నాయకులు, చేర్యాల మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి, ఐనాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, లెనిన్ నగర్ సర్పంచ్ సనాది సబితా భాస్కర్ కాంగ్రెస్‌లో చేరినట్లు వారు తెలిపారు.

కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి గెలుపునకు కృషి

చేర్యాల(సిద్దిపేట): గడిచిన 10 ఏళ్లలో ఈప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదని మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ నాగపురి రాజలింగంగౌడ్ అన్నారు. పట్టణకేంద్రంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి నివాసంలో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం నెలకొన్న పరిణామాల దృష్ట్యా జనగామ ప్రాంతం స్థానికేతరుల చేతిల్లోకి వెళ్లి పూర్తిగా వెనుకబాటుకు గురైందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి, ఔనత్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతోనే మాతృ పార్టీ అయిన కాంగ్రెస్‌లో చేరానన్నారు. జనగామ కాంగ్రెస్ అభ్యర్థి ప్రతాప్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. జెడ్పీ ఫ్లోర్‌లీడర్ గిరి కొండల్‌రెడ్డి, నాయకులు కొమ్మూరి రాకేష్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి సీపీఎం సర్పంచ్‌లు..

కొమురవెల్లి(సిద్దిపేట): మండలంలోని లెనిన్‌నగర్, అయినాపూర్ సీపీఎం సర్పంచ్‌లు సనాది సబిత భాస్కర్, చెరుకు రమణారెడ్డి, చేర్యాల మాజీ జెడ్పీటీసీ దాసరి కళావతి బుధవారం బచ్చన్నపేటలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ప్రతాప్‌రెడ్డిని అసెంబ్లీకి పంపాలి

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై మాట్లాడే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిని ఎమ్మెల్యే గెలిపించి అసెంబ్లీకి పంపించాలని ఆయన కోడలు కొమ్మూరి నాగప్రియాంకరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొడవటూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా సిద్దేశ్వరాలయంలో పూజలు చేసి చేతి గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నాయకులు మల్లం శ్రీనివాస్, నిమ్మ కరుణాకర్‌రెడ్డి, పాకాల చిరంజీవి, రాసూరి రామయ్య, జయ, కవిత పలువురు పాల్గొన్నారు.



అలింపూర్ ప్రచారంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి



పెంబర్తిలో కాంగ్రెస్ నాయకులతో ప్రశాంత్‌రెడ్డి

జనగామ బిడ్డను గెలిపించే బాధ్యత మీదే



జనగామ: పార్టీలో చేరిన నాయకులను స్వాగతిస్తున్న దశమంతరెడ్డి



జనగామ: పట్టణంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న దశమంతరెడ్డి

- అనుక్షణం అందుబాటులో ఉంటా
- బీజేపీ జనగామ అభ్యర్థి దశమంతరెడ్డి

జనగామ: జనగామ బిడ్డను.. స్థానికుడైన తనను గెలిపించుకునే బాధ్యత ఈ ప్రాంత ప్రజలపై ఉందని బీజేపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. పట్టణంలోని 26, 27, 28 వార్డుల్లో బుధవారం ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు. అనంతరం దశమంతరెడ్డి మాట్లాడుతూ ఆశీర్వదిస్తే, జనగామను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే బాధ్యతను తీసుకుంటామన్నారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసానికి, ఇబ్బందులకు గురయ్యారన్నారు. ఉద్యమ నేతగా చెప్పుకునే కేసీఆర్ ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత, కొత్తగా రేషన్ కార్డులు ఇవ్వక పోగా, పాత వాటిలో పిల్లల పేర్లు నమోదు చేసే అవకాశం కల్పించలేదన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసం కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఈ పదేళ్ల కాలంలో నిరుద్యోగం పెరిగిందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన నిరుద్యోగ భృతి హామీ సైతం తుంగలో తొక్కారని ఆరోపించారు. పేదల సొంతింటి కల సాకారం చేయకపోగా, అదిగో ఇదిగో అంటూ నేటికి మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జనగామ ప్రజలు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే, అభివృద్ధి, అవినీతి రహిత పరిపాలన ఎట్లా ఉంటుందో చూపిస్తానని చెప్పారు. బీజేపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమం బాగుంటుందని, ఓటర్లు కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలన్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలు చూపించేలా ఇక్కడ ఇండస్ట్రియల్ రంగాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రస్తుతం తెలంగాణలో అమలు చేస్తున్న అనేక కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. కాగా, ఆయా పార్టీల నుంచి బీజేపీలో చేరిన నాయకులు, కార్యకర్తలకు పార్టీ కండువా కప్పి స్వాగతించారు. సోడ రమేష్, పవన్‌శర్మ, సంపత్, శానబోయిన మహిపాల్ పాల్గొన్నారు.

కేంద్రం నిధులతో పథకాలు అమలు

జనగామ రూరల్: కేంద్రం నిధులతో రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తుందని ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. మండలంలోని శామీర్‌పేట, పెంబర్తి, సిద్దెంకి, ఎల్లంల గ్రామాల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉడుగుల రమేష్, బండారు తిరుపతి, శివరాజ్, కోంతం శ్రీనివాస్, మహిపాల్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



తరిగొప్పుల: ప్రచారంలో భాగంగా గొర్రె పిల్లను ఎత్తుకున్న రాజేశ్వర్‌రెడ్డి



తరిగొప్పుల: గజ మాలతో పల్లాకు స్వాగతం పలుకుతున్న అభిమానులు

- ఆశీర్వదించి గెలిపించండి
- బీఆర్‌ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నర్మెట: స్థానిక సమస్యలు పరిష్కరించి గ్రామాల అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.మండలంలోని గుంటూరుపల్లిలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్యతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ అన్ని కులాల వారికి కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తానని, మినీ వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేస్తానని అన్నారు. గ్రామాలకు ఇంటర్ లింకు రోడ్లు నిర్మిస్తానని చెప్పారు. మండల వ్యాప్తంగా డబుల్ బెడ్రూం ఇండ్లు, దళిత బంధు పథకాన్ని సక్రమంగా అమలు చేస్తానని తెలిపారు. తనపై విమర్శలు చేసే వారిని పట్టించుకోబోమన్నారు. సొంత ఖర్చులతో వ్యాయమశాల, అర్హులైన వారికి ఆసరా పింఛన్ అందేలా చూస్తానని చెప్పారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇప్పిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇమ్మడి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు బక్క నాగరాజు, ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, జెడ్పీటీసీ మాలోతు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, మండల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, ఎండీ గౌస్, మండల కోఆర్డినేటర్ నీరటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తా..

తరిగొప్పుల: తాను ఎమ్మెల్యే కాక ముందే జనగామ నియోజకవర్గంలోని తరిగొప్పుల, నర్మెట, మద్దూరు మండలాల్లో రూ.150 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేశానని, అదే మీరు ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ అభివృద్ధికి రూ.1500 కోట్ల నిధులు తీసుకువస్తానని పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలకేంద్రంలో ఆయన ఎన్నికల ప్రచారం చేపట్టారు. గడప గడపకు తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం మండల అధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలను ఉద్దేశించి పల్లా మాట్లాడారు. తరిగొప్పుల మండలాన్ని అభివృద్ధికి అద్దం పట్టేలా చేస్తానన్నారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే మండల కేంద్రంలో రూ.కోటితో అంబేడ్కర్ భవనం, ప్రభుత్వ కార్యాలయాల భవనాలు, తరిగొప్పుల శివారు నర్సింగాపూర్‌కు బీటీ రోడ్డు,కుల సంఘాల కమ్యూనిటీ భవనాలు, మినీ మార్కెట్ యార్డు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. మండలకేంద్రంలో రోడ్డు వెడల్పు చేసి డివైడర్ నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు, జల్లి సిద్ధయ్య, సర్పంచ్ దామెర ప్రభుదాస్, ఎంపీపీ జొన్నగోని అరితాసు దర్శన్‌గౌడ్, జెడ్పీటీసీ ముద్దసాని పద్మజావెంకట్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చెన్నూరి ప్రమీల సంజీవ, ఎంపీటీసీలు భూక్య జుంలాల్ నాయక్, అర్జుల మధుసూదన్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దప్పు చప్పుళ్లకు స్టెప్పులేసిన ఎమ్మెల్యే రాజయ్య..

మండలకేంద్రంలో బుధవారం పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేపట్టిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య డప్పు చప్పుళ్లకు, కోలాటాలకు కార్యకర్తలు,మహిళలతో కలిసి స్టెప్పులేసి ఉత్సాహ పరిచారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

జనగామ: జనగామ పట్టణంలోని 30 వార్డుల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపు కోరుతూ కారుగుర్తుకు ఓటు వేయాలని నాయకులు, కార్యకర్తలు గడపగడపకు ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు ప్రస్తుత మేనిఫెస్టోను వివరిస్తూ ప్రజలను ఓటు అభ్యర్థించారు. పలు వార్డుల్లో నమూనా ఈవీఎంలో బ్యాలెట్‌ను చూపిస్తే అభ్యర్థి క్రమ సంఖ్యపై అవగాహన కల్పించారు. 20వ వార్డు, ఆయా కాలనీల్లో కౌన్సిలర్ జూకంటి లక్ష్మీశ్రీశైలం, ఉడుగుల నర్సింహులు, తిప్పారపు విజయ్, సోషల్ మీడియా ఇంచార్జి రాజ్‌కుమార్, తదితరులు ప్రచారం చేపట్టారు. కాగా, వికాస నగర్‌లోని పల్లా క్యాంపు కార్యాలయంలో పెద్ద ఎత్తున చేరికలు జరిగాయి.

పల్లాకే పట్టం కట్టాలి

బచ్చన్నపేట: బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేగా జనగామ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డికే పట్టం కట్టాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుర్రపు బాల్‌రాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు గోపాల్‌నగర్ గ్రామంలో ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

జనగామ రూరల్: బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలిపించాలని కోరుతూ బుధవారం మండలంలోని శామీర్‌పేటలో ఎంపీపీ మేకల కళింగరాజు ఇంటింటి ప్రచారం చేశారు. ప్రభుత్వ పథకాలను వివరించి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సంక్షేమ పథకాలు దేశంలో ఎక్కడ లేవని తెలంగాణ అభివృద్ధి ప్రదాత కేసీఆర్‌ని మూడో సారి ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తాండ్ర స్వరూప ఉప సర్పంచ్ సంపత్, దుబ్బాక ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నర్మెట: చర్చిలో ఆశీర్వాదం తీసుకుంటున్న పల్లా



జనగామ: బీఆర్‌ఎస్‌లో చేరిన వారితో పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సీపీఎం ఎన్నికల ప్రచారం



బచ్చన్నపేట: సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థి మోకు కనకారెడ్డిని ఆదరించి గెలిపించాలని మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమస్యలు ఉన్న చోట మొదటగా వెళ్లి వాటిపై స్పందించేది ఎర్రజెండా నాయకులే అని తెలిపారు. అలాంటి నాయకులకు అధికారం ఇస్తే సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందేలా చూస్తామని తెలిపారు. పర్వతం నర్సింహులు, రాములు, అశోక్ పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం

రఘునాథపల్లి: మండలంలోని భాంజీపేటలో ఆకుల వెంకటయ్య ఇంట్లో బుధవారం తనిఖీ చేయగా అక్రమంగా నిల్వ చేసిన రూ.6 వేల విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చాగర్ల రఘుపతి తెలిపారు. అక్రమంగా మద్యం నిల్వ చేసినా, బెల్ట్ షాపుల్లో విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

బహుజనుల రాజ్యాధికారమే లక్ష్యం

- స్వతంత్ర అభ్యర్థి కుర్సపెల్లి నవ్య



స్టేషన్‌ఘన్‌పూర్: బహుజనుల అభివృద్ధి జరగాలంటే రాజ్యాధికారమే ప్రధానమని స్వతంత్ర అభ్యర్థి, ధర్మసాగర్ మండలం జానకీపురం సర్పంచ్ కుర్సపెల్లి నవ్య అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె బుధవారం ఘన్‌పూర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కరపత్రాలు పంచుతూ.. డైమండ్ గుర్తుకు ఓటు వేయాలని ప్రజలను అభ్యర్థించారు. నేను బహుజన బిడ్డగా మీ ముందుకు వచ్చాను.. ఆడవారు వంటింటికే పరిమితం కాకుండా రాజకీయాల్లో రాణించాలనే సంకల్పంతో ఎన్నికల్లో నిలిచానని అన్నారు. మహిళల సమస్యలపై పోరాడుతూ వారికి రక్షణగా ఉంటానని, విజ్ఞులైన ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

కాజీపేట అర్బన్: ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతి గృహాల్లో అందజేస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజనీర్ శంకర్ సూచించారు. హనుమకొండ జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలసముద్రంలోని బాలుర ఆశ్రమ పాఠశాల, రంగంపేట, లయోల పబ్లిక్ స్కూల్, రెడ్డికాలనీలోని బెస్ట్ అవైలబుల్ స్కీమ్ స్కూళ్లను శంకర్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లోని విద్యార్థులకు పాఠ్యపుస్తకాల పంపిణీ, స్టడీ మెటీరియల్స్, భోజనం, వంట సామగ్రిని పరిశీలించారు. వసతి గృహాల్లో అందజేస్తున్న వసతులపై విద్యార్థులతో నేరుగా మాట్లాడి తెలుసుకున్నారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి ప్రేమకళ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు

హన్మకొండ కల్చరల్: కార్తీక మాసంలోని మొదటి బుధవారాన్ని పురస్కరించుకుని భద్రకాళి రోడ్డులోని ధర్మశాస్త్ర అయ్యప్ప భక్త సేవాశ్రమంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక నిర్వాహకుడు, గురుస్వామి టీఆర్.సుబ్రమణ్యశర్మ ఆధ్వర్యంలో అర్చకుడు గణపతిశర్మ ఉదయం సుప్రభాత సేవ, విశేష ద్రవ్య అభిషేకం నిర్వహించి స్వామివారికి రాజకిరీటం ధరింపజేశారు. నిత్యపూజ, పుష్పాలంకరణ, నక్షత్ర హారతి, పంచ హారతి, కుంభహారతి, మహామంగళ, కర్పూర నీరాజనం జరిపించారు.

రైల్వే పెన్షనర్ల వార్షికోత్సవం

కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ రహమత్‌నగర్ కాలనీ ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ రైల్వేస్ బ్రాంచి 2వ వార్షికోత్సవం బుధవారం ముగిసింది. ఈమేరకు కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. సంఘం అధ్యక్షుడు పోక్కుల కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో ప్రధాన కార్యదర్శి జీ.సుధాకర్ వార్షిక నివేదికను సభ్యులకు నివేదించారు.